క్లుప్తంగా

'జమ్మికుంట పట్టణాభివృద్ధే ధ్యేయంగా పని చేశాం'



వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: పట్టణాభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గం పనిచేసిందని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి ఆబాది జమ్మికుంటలో రూ.75లక్షలు, కొత్తపల్లిలో రూ.కోటి నిధులతో పూర్తి చేసిన వైకుంఠధామాలను ప్రారంభించారు. వైస్ చైర్‌పర్సన్ స్వప్న కోటి, కౌన్సిలర్లు రవీందర్, శ్రీహరి, శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపిస్తాం



బస్సును ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

చిగురుమామిడి: ప్రతీ గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లికి ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సును శనివారం ప్రారంభించారు. 20ఏళ్ల గ్రామస్తుల కల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సాకారమైందన్నారు. అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి పొన్నం ప్రభాకర్ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, మాజీ ఎంపీటీసీ రమేశ్, ఉల్లంపల్లి, సుందరగిరి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు కానవేని శివకుమార్, ఎనగందుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

హమాలీ కార్మిక సంఘం నూతన కార్యవర్గం



జమ్మికుంట: హమాలీ కార్మిక సంఘం కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా పింగిళి రమేశ్, ఉపాధ్యక్షుడిగా వీర్ల సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సిరిమల్ల వీరయ్యలను ఎన్నుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గన్నేరువరం: హన్మాజిపల్లెకు చెందిన భూమాడి రాంరెడ్డి వైద్య పరీక్షల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.30వేల విలువైన చెక్కు మంజూరైంది. కాగా శనివారం అతడికి ఇంటి వద్ద కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు పారనంది సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

రామడుగు: గుండి గ్రామంలో రూ.2లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం మాజీ ఎంపీటీసీ మడ్డి శ్యాంసుందర్‌గౌడ్ ప్రారంభించారు. కాలనీవాసులు చంటయ్య, ఆంజనేయులు, చెంద్రయ్య, అంజి, భూమేశ్ పాల్గొన్నారు.

శంకరపట్నం: లింగాపూర్‌లో శనివారం సీసీరోడ్డు పనులను బీజేపీ నాయకుడు అంతం రాజిరెడ్డి ప్రారంభించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రూ.4లక్షలు మంజూరు చేయగా పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రత్యేకాధికారి మొగిలి, ఏఈ మల్లేశం పాల్గొన్నారు.

గన్నేరువరానికి 12 మంది టీచర్లు

గన్నేరువరం: స్పౌజ్ కేటగిరీ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌తో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 12 మంది ఉపాధ్యాయులు శనివారం కొత్తగా విధుల్లో చేరినట్లు ఎంఈవో రామయ్య తెలిపారు. ఖాసీంపేట ప్రాథమికోన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ తెలుగు మినహా ఉపాధ్యాయుల కొరత తీరిందన్నారు. రంగానాయకపల్లి (గుండ్లపల్లి)లో నలుగురు, మైలారంలో ముగ్గురు, ఖాసీంపేట, గునుకుల కొండాపూర్‌లో ఇద్దరు చొప్పున, హన్మజిపల్లెలో ఒకరు విధుల్లో చేరినట్లు వివరించారు.

భూమిపూజ

రామడుగు: మండల కేంద్రంలో వడ్డెర ఓబన్న విగ్రహ ఏర్పాటుకు శనివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమిపూజ చేశారు. గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల, మాజీ వైస్ ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్ గౌడ్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రూ.6.53 లక్షల ఆదాయం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి వేలం పాటలో రూ.6.53లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో సుధాకర్ తెలిపారు. లడ్డూ ప్రసాదం రూ.2.91లక్షలు, కొబ్బరి కాయలు, పూజా సామగ్రి రూ.1.90లక్షలు, వాహనాల పార్కింగ్ రూ. 1లక్ష, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునుటకు రూ.47వేలు వేలంలో ధర పలికినట్లు ఈవో పేర్కొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి



బీఎల్‌వోలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఆర్డీవో రమేశ్‌బాబు

హుజూరాబాద్: ఓటు నమోదు బీఎల్‌వోలదే కీలక పాత్ర అని ఆర్డీవో రమేశ్‌బాబు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని హుజూరాబాద్ పట్టణంలోని తన కార్యాలయంలో బీఎల్‌వోలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున బూత్‌ల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. అందులో తప్పుల్లేకుండా చూడాలని, కొత్తగా ఓటు నమోదుపై దృష్టి పెట్టాలని సూచించారు.

జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ..

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని రెవెన్యూ ఉద్యోగులు హుజూరాబాద్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గాంధీ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ కనకయ్య, ఆర్ఐ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆంజనేయరావు, అధ్యాపకులున్నారు.

గంగాధర: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయులు ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పీవో సురేశ్, అధ్యాపకులు తదితరులున్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో శనివారం తహసీల్దార్ రాణి ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. రెవిన్యూ అధికారులు, సిబ్బంది స్థానిక ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రార్థసారథి, ఆర్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సత్కారం

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ రాజేశ్వరి సీనియర్ సిటిజన్లను శనివారం సన్మానించారు. డీటీ సమ్మయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పదండి పాలకవర్గానికి సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: చొప్పదండి మున్సిపాలిటీ మొదటి పాలకవర్గం గడువు పూర్తి కావస్తుండడంతో శనివారం మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో పాలక వర్గాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజభూంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, కౌన్సిలర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేశ్, కమిషనర్ నాగరాజు, మేనేజర్ ప్రశాంత్, మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

వాటర్ ప్లాంట్ ప్రారంభం

చొప్పదండి మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2వ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అలాగే ఓటరు దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన నమూనా ఓటు వినియోగ పద్ధతిని పరిశీలించారు. ప్రిన్సిపాల్ మంగతాయారు, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేశ్, పూర్వ విద్యార్థులు వాసుదేవారెడ్డి, రాజమల్లు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



కౌన్సిలర్లను సన్మానిస్తున్న ప్రణవ్

జమ్మికుంట: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అర్హులందరికీ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని హుజూరాబాద్ డిపో రిటైర్డు కార్మికుల సంఘం నాయకులు కోరారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. రిటైర్డ్ కార్మికులకు సూపర్‌లగ్జరీలో ఉచిత ప్రయాణం, మెడికల్ స్కీంలో చేరనివారికి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో తవ్వటం సంపత్‌కుమార్, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, పేరాల లక్ష్మణ్‌రావు, గూడూరు మల్లారెడ్డి, నరసయ్య, లింగయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్ లక్ష్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఈ ఉపేందర్

హుజూరాబాద్: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా టీజీఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులు పని చేస్తున్నారని డీఈ ఉపేందర్ అన్నారు. విద్యుత్ శాఖాధికారుల పొలంబాట కార్యక్రమంలో భాగంగా శనివారం హుజూరాబాద్ మండలంలోని వెంకట్రావుపల్లె రైతులకు విద్యుత్ సరఫరా, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. లోఓల్టేజీ ఉన్న ప్రాంతాల్లో కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులుంటే లిఖితపూర్వకంగా తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, ఏఈ జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ డ్రైవర్లకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వేణు

హుజూరాబాద్: జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలను పురస్కరించుకొని శనివారం హుజూరాబాద్ పట్టణంలోని లారీ డ్రైవర్లకు రహదారి భద్రతా ప్రమాణాలపై ఎంవీఐ వేణు అవగాహన కల్పించారు. అతివేగం ప్రమాదకరమని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు శ్రీకాంత్, లారీల ఓనర్లు పాల్గొన్నారు.


న్యాయవాదులకు క్రీడా పోటీలు



క్రీడాపోటీల్లో పాల్గొన్న న్యాయవాదులు

హుజూరాబాద్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు క్రీడోత్సవాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ శనివారం ప్రారంభించారు. క్రీడలు న్యాయవాదుల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. హుజూరాబాద్ సబ్ జడ్జి పీబీ.కిరణ్‌కుమార్, కరీంనగర్ సబ్‌జడ్జి కె.వెంకటేశ్, జూనియర్ సివిల్ జడ్జి పి.అలేఖ్య, మేజిస్ట్రేట్లు గెడెం స్వాతి, పద్మ సాయిశ్రీ, ఏజీపీ గుర్రం శ్రీనివాస్, కార్యదర్శి తిరుపతి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి సౌమిత్ర, అలేఖ్య పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి పల్లకిసేవ



గన్నేరువరం: మైలారం శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి పల్లకిసేవ, ఒగ్గు కళాకారులచే ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం మల్లన్న పెద్ద పట్నాలు, స్వామివారి కల్యాణం, అభిషేకం వంటి కార్యక్రమాలు జరపనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వరాల పర్శరాములు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

చిట్టీల యజమాని రిమాండ్

శంకరపట్నం: చిట్టీ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాలు.. శంకరపట్నం మండలం కాచాపూర్‌కు చెందిన జన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి హుజూరాబాద్ మండలంలోని విద్యానగర్‌కు చెందిన వేముగంటి శ్రీనివాస్ వద్ద 2002లో రూ.5లక్షల చిట్టీ వేశాడు. డబ్బులు అడిగినప్పుడల్లా కాలం వెల్లదీస్తూ వచ్చాడు. బాధితుడు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.

అల్పాహారం అందజేత



రామడుగు: వెదిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు కరీంనగర్ శాతావాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అల్పాహారం, వాలీబాల్ క్రీడాసామగ్రి అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు చెన్నమనేని రామ్మోహన్‌రావు, ఆర్‌సీ మేచినేని సత్యనారాయణరావు, ప్రతినిధులు సురేందర్, సత్యం, రాజశేఖర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎం రాజమౌళి, టీచర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

చొప్పదండి: చొప్పదండి మండలంలోని ఆర్నకొండలో బీజేపీ మండల అధ్యక్షుడు మొగిలి మహేశ్ ఆధ్వర్యంలో శనివారం సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ బస్తీలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి మాట్లాడారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి ఎర్రోళ్ల ప్రశాంత్, నాయకులు మొగిలి సారయ్య, భూంరెడ్డి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న వైష్ణవి

రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.వైష్ణవి 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. శనివారం జిల్లా కేంద్రంలో ప్రశంసాపత్రాన్ని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్ చేతుల మీదుగా అందుకున్నట్లు పాఠశాల ఉపాధ్యాయుడు అవధూత శ్రీనివాస్ తెలిపారు.

ఆర్నకొండ పాఠశాల విద్యార్థి..

చొప్పదండి: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండలంలోని ఆర్నకొండ పాఠశాల విద్యార్థి పూసల సాయికీర్తన చొప్పదండి బాలుర పాఠశాల విద్యార్థి రుత్విక్‌లు ప్రతిభ కనబర్చినట్లు ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎంలు రాజిరెడ్డి తెలిపారు. వారికి శనివారం కరీంనగర్‌లోని ఆడిటోరియంలో డీఆర్‌వో పవన్‌కుమార్, మెప్మా పీడీ వేణుమాధవ్‌లు ప్రశంసాపత్రాలు అందజేశారన్నారు.

విద్యార్థికి అవార్డు

హుజూరాబాద్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి సుదర్శన్ కుమారుడు వడ్లూరి వేదార్థ ఎస్సార్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో చదువుతున్న సమయంలో లస్ట్రస్ లవ్ పేరిట ఇంగ్లిష్‌లో పుస్తకం రాసినందుకు వరల్డ్ బుక్ ఆఫ్ అవార్డు సాధించాడు. ఈ నెల 19న రాజస్తాన్‌లోని జైపూర్‌లో అవార్డు అందుకోగా రవీంద్రభారతిలో ప్రముఖులు అభినందించారు.

బోరు మోటార్‌కు మరమ్మతు

తిమ్మాపూర్: మొగిలిపాలెం గ్రామంలో 4, 8వ వార్డులో బోర్లు మరమ్మతుకు గురికాగా.. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, నుస్తులాపూర్ మాజీ సర్పంచ్ రావుల రమేశ్ సొంత ఖర్చులతో మరమ్మతు చేయించాడు. మార్కెట్ మాజీ డైరెక్టర్ పెట్టెం రమేశ్ ముద్రించిన 2025 సంవత్సరం క్యాలెండర్లను పంపిణీ చేశారు. వరుకోలు సమ్మయ్య, కొమ్మెర వెంకట్‌రెడ్డి, కొమ్మెర సంజీవరెడ్డి పాల్గొన్నారు.

బీమా పరిహారం చెల్లింపు

హుజూరాబాద్: పట్టణంలోని మాధవ పురుషుల పొదుపు సంఘంలో సభ్యునిగా ఉంటూ అనారోగ్యంతో మరణించిన నల్లగోని రవికి మంజూరైన బీమా పరిహారం రూ.40వేల చెక్కును సంఘం సభ్యులు శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘం అధ్యక్షుడు తొర్రి రవి, పాలకవర్గ సభ్యులు పసుల స్వామి, దండగుడు అశోక్, మామునూరు ప్రవీణ్, తాడవరం విష్ణుమూర్తి, పుల్లూరు యాదగిరి, గణకులు ప్రతాప మహేశ్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలకు తరలిరండి

జమ్మికుంట: సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను తరలిరావాలని ఆ పార్టీ జమ్మికుంట మండల కార్యదర్శి శీలం అశోక్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. మహాసభల్లో రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం చేయాల్సిన పోరాటాలకు రూపకల్పన జరుగుతుందని తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంటలో సీపీఎం మండల కార్యదర్శి చెల్పూరి రాము ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. మండల కమిటీ సభ్యులు శ్రీకాంత్, మల్లయ్య, సంతోష్, రాజేందర్ ఉన్నారు.

భరతమాత చిత్రపటానికి పూజలు

రామడుగు: శ్రీరాములపల్లి గ్రామంలో శనివారం సేవా బస్తీ కార్యక్రమంలో భాగంగా భరతమాత చిత్రపటానికి ధర్మ రక్ష సమితి ఆధ్వర్యంలో పూజలు చేశారు. సమితి నాయకులు పాకాల రాములుగౌడ్, భూత్కూరి లచ్చయ్య, సంపత్, అంజయ్య, రాజు, చంద్రయ్య, సుమంత్, అంజయ్య తదితరులున్నారు.

విద్యార్థినికి సన్మానం



గన్నేరువరం: జిల్లాస్థాయి ఇంగ్లిష్ ఉపన్యాస పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన గన్నేరువరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పత్తి వైశాలిని శనివారం గ్రామానికి చెందిన పుల్లెల జగన్మోహన్ సన్మానించారు. సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, యాదవ సంఘం మండల అధ్యక్షుడు సందవేణి ప్రశాంత్‌యాదవ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేపాక బాబు, పుల్లెల వేణుగోపాల్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆడబిడ్డ పెళ్లికి కల్యాణలక్ష్మితో అండ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

తిమ్మాపూర్: నిరుపేద ఆడబిడ్డలకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థికంగా అండగా నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీకాలనీలోని క్యాంపు కార్యాలయంలో తిమ్మాపూర్ మండలానికి చెందిన 28మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం చెక్కులు పంపిణీ చేశారు. పేదల జీవితాల్లో వెలుగు నింపడమే తమ ప్రభుత్వం లక్ష్యమని వెల్లడించారు. డిప్యూటీ తహసీల్దార్ బి.రాకేశ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణగౌడ్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ కౌన్సిలర్లను గెలిపించుకుంటా'



మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లందరినీ గెలిపించుకుంటానని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం శనివారం ముగియడంతో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కౌన్సిలర్లు తమతమ వార్డుల్లో ప్రజలకు అభివృద్ధి పనులు అందించారని కొనియాడారు. పదవీ విరమణ తర్వాత కూడా ప్రజా సమస్యలపై పోరాడుతూ సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ప్రజాసమస్యలపై తానెప్పుడూ స్పందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఆదిత్యారావు

జమ్మికుంట: సైబర్‌నేరాలు, మోసాలపై అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పరిశోధకుడు అక్షర ఆదిత్యారావు సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో సైబర్ భద్రత, నేటి పోకడలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఆదిత్యారావు మాట్లాడుతూ.. యువత యాప్ రుణాలు, అనవసరమైన లింక్‌ను ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము పోతుందని తెలిపారు. సైబర్‌నేరాలు జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ రమేశ్ పాల్గొన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం

జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ అధ్యక్షతన జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. 18ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ ఓదెలు కుమార్, అధ్యాపకులు కిరణ్‌కుమార్, ఉమాకిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రవి, కె.రవీందర్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

చిగురుమామిడి: చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. ఓపీ ఇంకా పెంచాలని, రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అని తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం లంబాడిపల్లి గ్రామంలో ఇమ్యూనైజేషన్ సెంటర్‌ను పరిశీలించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన వెంట డీఐవో సాజిద, మెడికల్ ఆఫీసర్ త్రిపులశ్రీ, సిబ్బంది ఉన్నారు.

ఓట్ల కోసమే గ్రామసభలు

మానకొండూర్: ఓట్ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభలు పెట్టి పథకాలు ఇస్తున్నామంటూ మభ్యపెడుతోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి ఆరోపించారు. శనివారం మానకొండూర్‌లో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామ, గ్రామాన గ్రామసభలు పెడుతూ ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి, మాజీ అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, ఉపాధ్యక్షులు ఊషకోయిల రమేశ్, శీలం కుమార్‌యాదవ్, పోచంపల్లి శ్రీనివాస్, కిసాన్‌మోర్చా మండల ప్రధాన కార్యదర్శి గాడిచర్ల భూమయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాడిశెట్టి అభిలాష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని వికాస్‌కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభ నిర్వహించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ రాజీలేని ఉద్యమాలు చేస్తోందన్నారు. అనంతరం మహాసభలో నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గిన్నారపు నితిన్, గజ్జల సందీప్‌ను ఎన్నుకున్నారు. నాయకులు అన్వేశ్, అజయ్, అరవింద్, ఈశ్వర్ రాహుల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని సర్వే నంబర్లు 840,841ల్లో పొంబండ వద్ద ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి హద్దురాళ్లు ఏర్పాటు చేయడంపై తహసీల్దార్ ముద్దసాని రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన హద్దురాళ్లు పాతుతున్నారనే సమాచారంతో మోఖాపైకి వెళ్లారు. వారివద్ద ఉన్న భూమి పత్రాలు పరిశీలించారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.